ప్రజాశక్తి

శుక్రవారం 14 ఏప్రిల్ 2023 | 5 | అనంతపురం

సమీక్ష సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ ఎమ్.గౌతమి

పక్కాగా ముఖ్యమంత్రి పర్యటన ఏర్పాట్లు

◆ అప్పజెప్పిన విధులను ఆయా అధికారులు సక్రమంగా నిర్వర్తించాలి

◆ కలెక్టర్ ఎమ్.గౌతమి, ఎస్పీ కె.శ్రీనివాసరావు

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్

ముఖ్యమంత్రి ఈ నెల 17వ తేదీన నార్పలలో చేపట్టబోయే కార్యక్రమానికి సంబంధించి పక్కాగా ఏర్పాట్లను పూర్తి చేసి అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పని చేసి విజయవంతం చేయాలని కలెక్టర్ ఎమ్.గౌతమి, ఎస్పీ కె.శ్రీనివాసరావు అధికారులను ఆదేశించారు. గురువారం ఉదయం స్థానిక కలెక్టరేట్లోని రెవెన్యూ భవనంలో జాయింట్ కలెక్టర్ కేతన్ గార్గ్‌తో కలిసి ముఖ్యమంత్రి పర్యటన ఏర్పాట్లపై జిల్లా అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఈ నెల 17వ తేదీన నార్పల మండల కేంద్రంలో జగనన్న వసతి దీవెన కార్యక్రమంలో రాష్ట్ర ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి పాల్గొంటున్నారని తెలిపారు. హెలిప్యాడ్ నుంచి సభాస్థలి వరకు ముఖ్యమంత్రి విచ్చేసే మార్గంలో ఎలాంటి అవాంతరాలు లేకుండా తగినంత రోప్ పార్టీలను ఏర్పాటు చేసుకుని పక్కాగా బందోబస్తు చర్యలు తీసుకోవాలన్నారు. పార్కింగ్, భోజన సదుపాయం ఏర్పాటు చేసిన ప్రదేశాల్లో ఎలాంటి సమస్యలు ఉత్పన్నం కాకుండా పోలీసు సిబ్బందిని కేటాయించాలన్నారు. విఐపిలు, అధికారులు, వాహనాల పాసుల జారీ విషయంలో సభాస్థలి, హెలిప్యాడ్ వద్ద సీటింగ్ కెపాసిటీని అనుసరించి పాసులు జారీ చేయాలన్నారు. వివిధ సంక్షేమ శాఖల అధికారులు విద్యార్థులు, లబ్ధిదారులను వారికి ఏర్పాటు చేసిన బస్సులలో సమావేశానికి తీసుకొని వచ్చి క్షేమంగా తిరిగి వారి గమ్య స్థానాలలో చేర్చాలన్నారు. సభాస్థలి వద్ద నిరంతర విద్యుత్ ఉండేలా చూడాలన్నారు. ముఖ్యమంత్రి పర్యటన విజయవంతం అయ్యేలా వారికి అప్పజెప్పిన విధులను సక్రమంగా నిర్వహించేలా అధికారులందరూ కషి చేయాలన్నారు. ఎస్పీ మాట్లాడుతూ ముఖ్యమంత్రి పర్యటనకు పటిష్టమైన బందోబస్తు ఏర్పాటు చేయనున్నట్లు చెప్పారు. నార్పల నాలుగు రోడ్ల జంక్షన్ వద్ద ఒకవైపు వాహనాలు వెళ్లేలా మరొకవైపు విఐపి వాహనాలు వెళ్లేలా ఏర్పాట్లు చేస్తామన్నారు. అన్ని ప్రాంతాల్లో తగినంత పోలీసు సిబ్బందిని ఏర్పాటు చేసి పక్కాగా భద్రతాపరమైన చర్యలు తీసుకుంటామని తెలిపారు. సమావేశ ప్రాంతంలో ఏవైనా సమస్యలు ఉంటే అక్కడ విధులు నిర్వహిస్తున్న సిబ్బందితో వాదనకు దిగకుండా డీఎస్పీ ప్రసాద్ రెడ్డిని సంప్రదించాలన్నారు.

◆ టిడిపి శ్రేణుల్లో నూతనోత్తేజాన్ని నింపిన యాత్ర

◆ కదిరి నియోజకవర్గం నుంచి తాడిపత్రి వరకు కొనసాగిన యాత్ర

◆ అన్ని నియోజకవర్గాల్లో భారీగా పాల్గొన్న తెలుగు దేశం అభిమానులు

◆ కలిసొచ్చిన ఎమ్మెల్సీ ఎన్నికల ఫలితాలు

ముగిసిన 'యువగళం'

ప్రజాశక్తి-అనంతపురం ప్రతినిధి

యువగళం పేరుతో టిడిపి జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ చేపట్టిన పాదయాత్ర గురువారంతో ఉమ్మడి అనంతపురం జిల్లాలో ముగిసింది. గురువారం ఉదయం యాడికి మండలం రైవాలమడుగు గ్రామం మీదుగా కర్నూలు జిల్లాలోకి ప్రవేశించింది. సుమారు నెల రోజులు పాటు ఉమ్మడి అనంతపురం జిల్లాలో లోకేష్ పాదయాత్ర సాగింది. తొమ్మిది నియోజకవర్గాల్లో సాగిన ఈ యాత్ర టిడిపి శ్రేణుల్లోనూ నూతనోత్తేజాన్నే నింపిందని చెప్పవచ్చు. ఈ యాత్ర సాగుతున్న సమయంలోనే రాయలసీమ పట్టభద్రుల నియోజకవర్గం ఎమ్మెల్సీ ఎన్నికల్లో టిడిపి విజయం సాధించడం ఆ పార్టీకి మరింత ఊపును తెచ్చింది. సగటున నియోజకవర్గానికి మూడు రోజుల చొప్పున సాగిన ఈ యాత్రలో లోకేష్ అందరినీ కలుసుకుంటూ ప్రజా సమస్యలు తెలుసుకోవడమే కాకుండా వాటికి తాము అధికారంలో వస్తే పరిష్కరిస్తామన్న హామీలూ ఇస్తూ పోయారు. సామాజిక తరగతుల వారీగా సమస్యలతోపాటు రైతులు, ఇతర వృత్తిదారులను కూడా కలుసుకుని వారిని ఆదుకుంటామన్న భరోసాను కల్పిస్తూ ఈ యాత్ర సాగింది. ఈ యాత్రకు కొన్ని చోట్ల భారీ స్పందన సైతం కనిపించింది. మరోవైపు నియోజకవర్గంలో ఆయా నియోజకవర్గ ఎమ్మెల్యేల పనితీరును, అవినీతిని ఎత్తిచూపడం, దానిపై వైసిపి ప్రతిస్పందించడంతో రాజకీయ వాతావరణం వేడెక్కింది. విమర్శలు, ప్రతి విమర్శలు తీవ్ర స్థాయిలోనే రెండు పార్టీల మధ్య సాగాయి. పుట్టపర్తిలో రెండు పార్టీలకు చెందిన వారు ఏకంగా ఘర్షణకు సైతం దిగడం ఉద్రిక్తత పరిస్థితులు నెలకొన్నాయి. ధర్మవరంలో యర్రగుట్టను ఎమ్మెల్యే కేతిరెడ్డి వెంకటరామిరెడ్డి కబ్జా చేసారన్న ఆరోపణలపైనా పెద్ద దుమారమే రేగింది. దీనిపై నారా లోకేష్, ఎమ్మెల్యే కేతిరెడ్డి మధ్య రెండు, మూడురోజుల పాటు ఆరోపణల పర్వం కొనసాగింది. ఆ తరువాత రాప్తాడు జాకీ పరిశ్రమ పోవడానికిగల కారణాలపైన టిడిపి, వైసిపిల మధ్య మాటల యుద్ధం సాగింది. శింగనమలలో ఇన్‌ఛార్జి పాలన వైసిపి సాగిస్తోందన్న దీనిపై విమర్శలు ప్రతివిమర్శలు సాగాయి. తాడిపత్రిలో నియోజకరవ్గంలోకి అడుగు పెట్టకముందే తాడిపత్రి ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి సవాల్, ప్రతిసవాళ్లు విసరడమే కాకుండా ఆధారాల్లేకుండా ఆరోపణలు చేస్తే సహించబోమని చెప్పడంతో యువగళం పాదయాత్ర అక్కడ అడుగు పెట్టకముందే రాజకీయ వాతావరణం మరింత వేడెక్కింది. ఈ పరిస్థితుల్లో శాంతిభద్రతల సమస్య వచ్చే అవకాశముందని భావించిన పోలీసులు లోకేష్‌కు ముందస్తుగా నోటీసులు అందజేయడం చర్చనీయాంశమైంది. రెచ్చగొట్టే ప్రసంగాలు చేస్తే చర్యలు తీసుకుంటామని చెప్పారు. ఈ మాటల యుద్ధం నడుమే పాదయాత్ర ముగిసింది. పాదయాత్ర ముగింపు రోజు గురువారం నాడు జిల్లా దాటుతున్న సమయంలో లోకేష్ ప్రకటన విడుదల చేశారు. ఈ జిల్లా ప్రజలు చూపిన ఆదరణ అభిమానాలు గుర్తుపెట్టుకుంటానని చెప్పారు. ఇక్కడి సమస్యలను పరిష్కరించ డంలో ప్రభుత్వం ఏ రకంగా విఫలమైందన్నది తెలిసిందన్నారు. టిడిపి అధికారంలోకి వస్తే సమస్యలను పరిష్కరిస్తామని హామీనిచ్చారు. ఈ రకంగా జిల్లాలో యువగళం పాదయాత్ర నెల రోజులపాటు సాగింది. ఈ యాత్రకు ప్రజల్లో కనిపించిన స్పందన చూసి నేతల్లో ఉత్సాహం పెరిగింది. మరో ఏడాది ఎన్నికలున్న సమయంలో ఈ యాత్ర విజయవంతమవడం, మండలి ఎన్నికల్లో విజయం కలిపి వచ్చే ఎన్నికల్లో పార్టీకి అనుకూలమైన వాతావరణం కనిపిస్తోందన్న ఆనందం ఆ పార్టీ శ్రేణుల్లోనూ కనిపిస్తోంది.

జెఎన్‌టియు బీటెక్ ఫలితాలు విడుదల

ప్రజాశక్తి-అనంతపురం :

అనంతపురం జెఎన్‌టియు పరిధిలో నిర్వహించిన బీ.టెక్ 2వ సంవత్సరం 1వ సెమిస్టర్ (ఆర్.15, ఆర్.19) సప్లిమెంటరీ పరీక్ష పలితాలు, ఎం.టెక్ 3వ సెమిస్టర్ (ఆర్.17) సప్లిమెంటరీ, ఎం.టెక్ 3వ సెమిస్టర్ (ఆర్.21) రెగ్యులర్ పరీక్ష పలితాలను గురువారం సాయంత్రం విడుదల చేసినట్లు డైరెక్టర్ అఫ్ ఎవాల్యుయేషన్ ఇ.కేశవరెడ్డి, కంట్రోలర్ బి.చంద్రమోహన్‌రెడ్డి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. పరీక్ష పలితాల కోసం జెఎన్‌టియు వెబ్‌సైట్ http://jntuaresults.ac.inను సంప్రదించాలని తెలిపారు.

బట్టలూడదీసి కొడతా..

మేయర్ సమక్షంలోనే కార్యదర్శికి బిజెపి నేతల బెదిరింపు - కమలం నేతల తీరుపై సర్వత్రా విమర్శలు

ప్రజాశక్తి-అనంతపురం కార్పొరేషన్

మార్వాడీల పొట్ట కొడితే అధికారులను గుడ్డలు ఊడదీసి కొడతామని బిజెపి నేతలు హెచ్చరించారు. నగరంలోని రాజు రోడ్డులో ఉన్న మహావీర్ ప్లాస్టిక్స్, మహాలక్ష్మి ప్లాస్టిక్స్ దుకాణాలపై పొల్యూషన్ కంట్రోల్ బోర్డు, పోలీస్ మున్సిపల్ కార్పొరేషన్ అధికారులు సంయుక్తంగా బుధవారం దాడులు నిర్వహించి 11 టన్నుల ప్లాస్టిక్‌ను సీజ్ చేసిన విషయం తెలిసిందే. విషయం తెలుసుకున్న బిజెపి నేతలు గురువారం నగరంలోని కార్పొరేషన్ కార్యాలయానికి చేరుకుని స్వయానా మేయర్ మొహమ్మద్ వసీం సమక్షంలోనే మున్సిపల్ కార్పొరేషన్ కార్యదర్శి సంఘం శ్రీనివాసులుపై నానా దుర్భాషలాడారు. ఈసందర్భంగా బిజెపి నాయకులు లలిత్‌కుమార్, ఫయాజ్‌బాషా మాట్లాడుతూ ఊరు కాని ఊరు వచ్చి బతుకుదెరువు కోసం ప్లాస్టిక్స్ కవర్లను విక్రయిస్తున్న దుకాణదారులపై దాడులు నిర్వహించి వాటి పొట్టకొట్టడం ఏంటని అధికారులను నిలదీశారు. ప్లాస్టిక్ పట్టివేతకు తాము వ్యతిరేకం కాదంటూనే మార్వాడీల పొట్ట కొడితే మాత్రం అధికారులను బట్టలూడదీసి కొడతామంటూ హెచ్చరించారు. దీంతో కార్పొరేషన్ ఉద్యోగ వర్గాల్లో తీవ్ర ఆగ్రహం వ్యక్తమైంది. మధ్యాహ్నం ఉద్యోగులు నల్లబ్యాడ్జీలు ధరించి కార్పొరేషన్ ముందు నిరసన వ్యక్తం చేశారు. వెంటనే బిజెపి నాయకులపై చర్యలు తీసుకోవాలని కమిషనర్ రమణారెడ్డిని కలిసి వినతిపత్రం అందజేశారు.

అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్న బిజెపి నాయకులు

ఉద్యోగులపై దాడి చేస్తే చేతులు ముడుచుకుని కూర్చోం..

ఉద్యోగులకు సిపిఎం నాయకుల మద్దతు

ఉద్యోగులపై బిజెపి నాయకులు దాడులు చేస్తూ ఉంటే చేతులు ముడుచుకుని కూర్చోమని సిపిఎం నాయకులు హెచ్చరించారు. మున్సిపల్ కార్పొరేషన్ కార్యదర్శి సంఘం శ్రీనివాసులుపై బిజెపి నాయకులు చేసిన వ్యాఖ్యలకు ఉద్యోగులు చేపట్టిన ఆందోళనకు సిపిఎం నాయకులు మద్దతు పలికారు. ఈ సందర్భంగా మున్సిపల్ ఉద్యోగ కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షుడు నాగభూషణం, జిల్లా అధ్యక్షుడు ఎటిఎం నాగరాజు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు అధికారులు ప్లాస్టిక్ దుకాణాలపై దాడులు నిర్వహించి చేస్తే బట్టలూడదీసి కొడతామని బిజెపి నేతలు బెదిరించటం దారుణమన్నారు. ఉద్యోగ వర్గాలపై దాష్టికం చేస్తుంటే చూస్తూ ఊరుకోమన్నారు. స్వయానా మేయర్ మొహమ్మద్ వసీం సమక్షంలోనే అధికారిని బెదిరించడం ఏంటని ప్రశ్నించారు. అధికారులను బట్టలూడదీసి కొడతామని బెదిరించిన బిజెపి నాయకులకు ఉగ్యోగ వర్గాలతో అదే పని చేయిస్తామన్నారు. బిజెపి నేతలకు దమ్ముంటే ప్లాస్టిక్ నిషేధం ఎత్తివేయాలనే జీవోను రద్దు చేయించాలని డిమాండ్ చేశారు. అంతేగానీ ఉద్యోగుల జోలికి వస్తే బిజెపి నేతలకు బట్టలూడదీసి కొడతామని హెచ్చరించారు. అధికారులపై బెదిరింపులకు పాల్పడుతూ దాష్టీకం చేసిన బిజెపి నేతలు లలిత్, ఫిరోజ్, తదితరులు వెంటనే ఉద్యోగ వర్గాలకు క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. లేదంటే త్వరలో కార్పొరేషన్ ఉద్యోగులతో సమావేశమై భవిష్యత్ ఆందోళనలకు శ్రీకారం చుడుతామని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో ఎపి ఎన్జీవోస్ కార్యదర్శి ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.

ఎడాపెడా విద్యుత్ కోతలు

ఎండుతున్న పంటలు - లబోదిబోమంటున్న రైతులు

ప్రజాశక్తి-బొమ్మనహాళ్



నీరు లేక ఎండుతున్న వరిపైరు (ఇన్‌సెట్‌లో) వ్యవసాయ బోరు స్టార్టర్

మండలంలో ఎడాపెడా విద్యుత్ కోతలు విధిస్తుండటంతో పంటలకు నీరు లేక ఎండిపోతున్నాయి. మండలంలోని గోవిందవాడ, ఉప్పరాల, బొమ్మనహాల్, సోమలాపురం, గొడుసులపల్లి తదితర గ్రామాల పరిధిలో రైతులు సాగుచేసిన పంటలు పూర్తిగా ఎండుదశకు చేరుకున్నాయి. దీంతో రైతులు లబోదిబోమంటున్నారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు వ్యవసాయానికి నిరంతరాయంగా 9 గంటలు విద్యుత్ సరఫరా చేయాలి. అయితే రెండు విభాగాలుగా విభజించి ఉదయం 9 గంటలకు ఇచ్చి మధ్యాహ్నం ఒంటిగంట వరకూ, సాయంత్రం 6 నుంచి 10 గంటల వరకూ విద్యుత్ సరఫరా చేస్తున్నారు. ఈమధ్యలో రైతులకు, ప్రజలకు ఏమైనా విద్యుత్ సమస్యలు ఎదురైతే ఎల్‌సిలు తీసుకుని విద్యుత్‌ను నిలిపివేస్తున్నారు. దీంతో కనీసం ఏడు గంటలు కూడా విద్యుత్ సరఫరా కావడం లేదని వాపోతున్నారు. ప్రస్తుతం పత్తి, మొక్కజొన్న, వరి పంటలు కొత దశకు చేరుకున్నాయి. ఈసయంలో విద్యుత్ కోతలు విధిస్తుండటంతో పంటలు ఎండిపోతున్నాయి. ఫలితంగా వేలాది రూపాయలు పెట్టిన పెట్టుబడులు నాశనమయ్యే అవకాశం ఉందని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఈ విషయమై ఆయా సబ్‌స్టేషన్ పరిధిలోని అధికారులను అడగ్గా ఇవన్నీ మామూలే అని కొట్టిపారేస్తున్నారని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఎండలు మండుతున్న నేపథ్యంలో ఒకవైపు తాగునీరు, మరోవైపు వ్యవసాయ పొలాలకు నీరు లేక తీవ్ర ఇబ్బందులు పడాల్సి వాస్తోంది. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి నిరంతరాయంగా 9గంటలు విద్యుత్ సరఫరా చేయాలని రైతులు, ప్రజలు కోరుతున్నారు.

మృతిచెందిన భార్యాభర్తలు నాగేంద్ర, రాణీ

రోడ్డు ప్రమాదంలో దంపతుల మృతి

ప్రజాశక్తి-గుత్తి

మండలంలోని జక్కలచెరువు గ్రామ సమీపంలో 67వ జాతీయ రహదారిపై గురువారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో దంపతులు మృతి చెందారు. పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాల మేరకు.. గుంతకల్లు మండలం దంచర్ల గ్రామానికి చెందిన భార్యాభర్తలు నాగేంద్ర (40), రాణీ (35) తాడిపత్రి వద్ద బంధువుల దినకర్మకు ద్విచక్ర వాహనంలో వెళ్లారు. కార్యక్రమం అనంతరం తిరిగి స్వగ్రామానికి వస్తుండగా జక్కలచెరువు గ్రామం వద్దకు రాగానే లారీ ఢీకొంది. దీంతో ఇద్దరూ అక్కడకక్కడే మృతిచెందారు. మృతులకు ముగ్గురు కుమార్తెలు. విషయం తెలుసుకున్న పోలీసులు వెంటనే ఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. తర్వాత మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం గుత్తి ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ఘటనపై కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

ప్రభుత్వ భూములను కాపాడాలి

సిపిఎం జిల్లా కార్యదర్శి రాంభూపాల్

ప్రజాశక్తి-గార్లదిన్నె

అధికార పార్టీ నాయకుల కబంధ హస్తాల నుంచి ప్రభుత్వ భూమిని కాపాడాలని సిపిఎం జిల్లా కార్యదర్శి రాంభూపాల్ డిమాండ్ చేశారు. ఈమేరకు గురువారం మండల కేంద్రంలో అధికార పార్టీ నాయకులు కబ్జా చేసిన భూమిని సిపిఎం నాయకులు పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండల కేంద్రంలోని సర్వే నెంబర్ 456లో 6.10 ఎకరాల ప్రభుత్వ భూమిని అధికార పార్టీకి చెందిన నాయకులు దొంగ పత్రాలు సృష్టించి కబ్జా చేశారన్నారు. నకిలీ పత్రాలు సృష్టించడంలో 2022లో పనిచేసిన తహశీల్దార్ పాత్ర ఉందన్నారు. పేదల ఇల్లు కట్టుకోవడానికి ఎక్కడైనా సెంటు భూమి అడిగితే ఇవ్వలేని అధికారులు అధికార పార్టీ నాయకులకు మాత్రం ఎకరాలకు ఎకరాలు కట్టబెట్టడం ఏంటని ప్రశ్నించారు. అంతేగాకుండా జగనన్న కాలనీల కోసం పేదలకు మాత్రం ఎక్కడో వంకల్లోనో.. వాగుల్లోనో పట్టాలిస్తూ, అధికార పార్టీ నాయకులకు మాత్రం రూ.కోట్ల విలువైన భూమిని ధారాదత్తం చేస్తున్నారని ఆరోపించారు. అధికార పార్టీ ఒత్తిళ్లకు, ముడుపులకు తలొగ్గి ఇలాంటి పనులు చేయడం అధికారులకు తగదన్నారు. ఎలాంటి అనుమతులు లేకుండా ప్రభుత్వ భూమిలో వెంచర్లు వేస్తుంటే అధికారులు చూస్తూ ఉండటంలో ఆంతర్యం ఏంటని ప్రశ్నించారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి కబ్జాకు గురైన ప్రభుత్వం భూమిని స్వాధీనం చేసుకోవాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో సిపిఎం ఆధ్వర్యంలోనే కబ్జాకు గురైన భూమిని స్వాధీనం చేసుకుని పేదలకు ఇళ్ల స్థలాలు పంపిణీ చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో రైతుసంఘం జిల్లా అధ్యక్షుడు తరిమెల నాగరాజు, సిపిఎం మండల కార్యదర్శి చెన్నారెడ్డి, నాయకులు మల్లికార్జున, నల్లప్ప, తదితరులు పాల్గొన్నారు.

కబ్జా చేసిన భూమిని పరిశీలిస్తున్న సిపిఎం జిల్లా కార్యదర్శి రాంభూపాల్

యువతకు మరిన్ని ఉద్యోగావకాశాలు

రైల్వే సహాయ మంత్రి రావ్ పాటిల్ సాహెబ్ దన్వే

ప్రజాశక్తి-గుంతకల్లు



మాట్లాడుతున్న రైల్వే సహాయ మంత్రి రావ్ పాటిల్ సాహెబ్ దన్వే

ప్రధాని నరేంద్ర మోడీ పాలనలో దేశవ్యాప్తంగా కేంద్ర ప్రభుత్వ రంగసంస్థల్లో యువతకు మరిన్ని ఉద్యోగావకాశాలు కల్పిస్తామని రైల్వే సహాయ మంత్రి రావ్ పాటిల్ సాహెబ్ దన్వే తెలిపారు. గురువారం స్థానిక రైల్వే ఇన్స్టిట్యూట్‌లో డివిజినల్ రైల్వే మేనేజర్ వెంకట రమణారెడ్డి ఆధ్వర్యంలో రోజ్ గార్ మేళా పథకం ద్వారా ఆర్ఆర్‌బి, ఆర్ఆర్‌సి పరీక్షల ద్వారా ఎంపికైన అభ్యర్థులకు ఉద్యోగ నియామక పత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్రంలో నరేంద్ర మోడీ పాలనలోని బిజెపి ప్రభుత్వం రోజ్ గార్ మేళా పథకం ద్వారా దేశవ్యాప్తంగా భారతీయ రైల్వే శాఖతో పాటు వివిధ కేంద్ర ప్రభుత్వ శాఖలలో 17 వేల పైచిలుకు యువతకు ఉద్యోగ అర్హత సాధించారన్నారు. ప్రధాని మోడీ వర్చువల్ ద్వారా అర్హులైన అభ్యర్థులకు ఉద్యోగ నియామక పత్రాలను అందజేసి మిగిలిన అభ్యర్థులకు ఈ మెయిల్ ద్వారా నియామక పత్రాలు అందజేస్తామన్నారు. గుంతకల్లు రైల్వే డివిజన్ పరిధిలో 1100 మందికి, పోస్టల్ శాఖలో 13 మందికి, కేంద్ర ప్రభుత్వ ఉన్నత విద్యాశాఖలో 23 మందికి ఉద్యోగాలు దక్కాయన్నారు. రానున్న రోజుల్లో యువతకు మరిన్ని ఉద్యోగ అవకాశాలు కల్పిస్తామని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే వెంకట్రామిరెడ్డి, జిల్లా పరిషత్ ఛైర్‌పర్సన్ బోయ గిరిజమ్మ, మున్సిపల్ ఛైర్‌పర్సన్ నంగినేని భవాని, ఎడిఆర్ఎం సూర్యనారాయణ, సీనియర్ డిసిఎం ప్రశాంత్‌కుమార్, సీనియర్ డిపిఓ జయశంకర్ చౌహాన్, ఆర్‌పిఎఫ్ కమాండెంట్ మురళీకృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

గుత్తిలో పోస్టర్లు విడుదల చేస్తున్న వామపక్షాల నాయకులు

మోడీ ప్రజా వ్యతిరేక విధానాలను తిప్పికొట్టాలి

నేటి నుంచి ప్రచారభేరి - వామపక్షాల ఆధ్వర్యంలో పోస్టర్లు విడుదల

ప్రజాశక్తి-గుత్తి

ప్రధాని నరేంద్రమోడీ అవలంభిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలను తిప్పికొట్టాలని సిపిఎం మండల కార్యదర్శి బి.రామకృష్ణ, సిపిఐ మండల కార్యదర్శి రామదాసు పిలుపునిచ్చారు. గురువారం పట్టణంలోని అంబేద్కర్ అతిథి గృహంలో కేంద్ర ప్రభుత్వ ప్రజా వ్యతిరేక, నిరంకుశ విధానాలపై ఈనెల 14 నుంచి 30 వరకు చేపట్టనున్న ప్రచారభేరికి సంబంధించిన వాల్‌పోస్టర్లను విడుదల చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్రానికి ప్రత్యేక హోదా, విభజన హామీలు, పోలవరం నిర్మాణంపై కేంద్ర ప్రభుత్వం చేసిన ద్రోహాన్ని నిరసిస్తామన్నారు. ముఖ్యంగా రాజ్యాంగం కల్పించిన ప్రజాస్వామిక హక్కులను కాపాడేందుకు ప్రతి ఒక్కరూ కేంద్ర ప్రభుత్వాన్ని వ్యతిరేకించాలన్నారు. విశాఖ ఉక్కు పరిశ్రమ అమ్మకాన్ని వ్యతిరేకిస్తూ పెద్ద ఎత్తున ఉద్యమాలు చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సిపిఎం జిల్లా కమిటీ సభ్యురాలు వి.నిర్మల, నాయకులు రామచంద్రారెడ్డి, సిపిఐ మండల కార్యదర్శి రామదాసు, మహిళా సమైక్య జిల్లా అధ్యక్షురాలు పార్వతీప్రసాద్, కార్యదర్శి పద్మావతి, మండల కార్యదర్శి మహమూదా, గిరిజన సమాఖ్య రాష్ట్ర అధ్యక్షులు రామాంజనేయులు, సిపిఐ నాయకులు రమేష్, రామకృష్ణ, షఫీ, రాజు, తదితరులు పాల్గొన్నారు.

శింగనమల : బిజెపి నిరంకుశ, మతోన్మాద విధానాలను తిప్పికొట్టాలని సిపిఎం మండల కార్యదర్శి భాస్కర్, సిపిఐ జిల్లా కమిటీ సభ్యుడు చిన్నప్పయాదవ్, సిపిఐ మండల కార్యదర్శి రామాంజనేయులు పిలుపునిచ్చారు. గురువారం మండలం కేంద్రంలో నేటి నుంచి చేపట్టనున్న ప్రచార భేరికి సంబంధించిన పోస్టర్లను విడుదల చేశారు. ఈ సందర్భంగా కేంద్రంలో మోడీ, అమిత్‌షాల నాయకత్వంలో బిజెపి, ఆర్‌ఎస్‌ఎస్ కూటములు కలిసిమెలిసి దేశంలో మత విద్వేషాలను రెచ్చగొడుతున్నారన్నారు. అదానీ, అంబానీ లాంటి అతి సంపన్నులకు దేశ సంపదలు దోచిపెడుతూ సామాన్య ప్రజానీకాన్ని గాలికి వదిలేశారన్నారు. కేంద్ర ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలను నిరసిస్తూ చేపట్టనున్న ప్రచార భేరిలో ప్రతి ఒక్కరూ పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో వామపక్షాల నాయకులు మధు, గంపమలయ్య, సుంకన్న, ఆదినారాయణ, లక్ష్మీనారాయణరెడ్డి, బయన్న, తదితరులు పాల్గొన్నారు.

పుట్లూరు : మండల కేంద్రంలోని బస్టాండ్ సర్కిల్‌లో వామపక్షాల నాయకులు నేటి నుంచి ప్రారంభం కానున్న ప్రచార భేరి గోడపత్రికలను గురువారం విడుదల చేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వ ప్రజా వ్యతిరేక, నిరంకుశ విధానాలపై ఏప్రిల్ 14 నుంచి 30 వరకు ప్రచార భేరి నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ భేరిలో బిజెపి మతోన్మాద, కార్పొరేట్ అనుకూల, ప్రయివేటీకరణ విధానాలను ప్రజలకు వివరించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల కార్యదర్శి డి.పెద్దయ్య, డిహెచ్‌పిఎస్ మండల కార్యదర్శి ఏ.రమేష్, వ్యవసాయ కార్మిక సంఘం మండల అధ్యక్షులు సి.పెద్దిరాజు, చేతి వృత్తిదారుల మండల అధ్యక్షులు సి.ఓబులపతి, దేవరాజు, విజయ్, రామాంజనేయులు, లక్ష్మీనారాయణ, తదితరులు పాల్గొన్నారు.

గుంతకల్లు : ప్రజా వ్యతిరేక పాలన, నిరంకుశ, మతోన్మాద్యాన్ని అవలంభిస్తున్న బిజెపిని సాగనంపుదాం – దేశాన్ని కాపాడు కుందాం అంటూ ఈనెల 14 నుంచి 30వ తేదీ వరకు చేపట్టనున్న ప్రచారభేరిని జయప్రదం చేయాలని వామపక్షాల నాయకులు పిలుపునిచ్చారు. గురువారం స్థానిక బిటి.పక్కీరప్ప భవనంలో ప్రచార భేరీ గోడ పత్రికలను విడుదల చేశారు. ఈ సందర్భంగా సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు బి.శ్రీనివాసులు, సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు బి.గోవిందు మాట్లాడుతూ కేంద్రంలోని బిజెపి ప్రభుత్వ విధానాలతో దేశంలో ప్రజాస్వామ్యం ప్రమాదంలో పడిందన్నారు. కేంద్ర ప్రభుత్వ దుర్మార్గాలను ప్రతి పౌరుడు నిలదీయాలన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఎం పట్టణ కార్యదర్శి బి.శ్రీనివాసులు, సిఐటియు నాయకులు నాగరాజు, మారుతీప్రసాద్, నియోజకవర్గ సిపిఐ కార్యదర్శి వీరభద్రస్వామి, పట్టణ కార్యదర్శి గోపీనాథ్, సిపిఐ నాయకులు గౌస్ తదితరులు పాల్గొన్నారు.

ఉరవకొండ : ప్రజా వ్యతిరేక, నిరంకుశ, మతోన్మాద విధానాలను అనుసరిస్తున్న బిజెపి ప్రభుత్వాన్ని సాగనంపి దేశాన్ని కాపాడుకుందామని సిపిఎం, సిపిఐ నాయకులు పిలుపునిచ్చారు. గురువారం పట్టణంలోని సిపిఐ కార్యాలయంలో నేటి నుంచి ఏప్రిల్ 30 వరకూ నిర్వహించనున్న ప్రచార భేరి సంబంధించిన గోడపత్రికలను విడుదల చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ దేశంలో ప్రజాస్వామ్యాన్ని నిర్వీర్యం చేస్తున్న బిజెపి ప్రభుత్వం దుర్మార్గాలను ఎండగట్టేందుకు ప్రచార భేరి కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. అంతేకాకుండా దేశ ప్రజల మధ్య మత విద్వేషాలు రెచ్చగొడుతూ శాంతి భద్రతలకు విఘాతం కల్పిస్తున్నారని ఆరోపించారు. ముఖ్యంగా అదానీ, అంబానీ లాంటి బడాబాబులకు దేశ సంపదను దోచిపెడుతున్నారన్నారు. ఇవన్నీ ప్రజలకు వివరించేందుకే ప్రచార భేరి కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో సిపిఎం మండల కన్వీనర్ మధుసూదన్, నాయకులు సిద్ధప్ప, రమేష్, మల్లికార్జున, మనోహర్, మహిళా సంఘం సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

శింగనమలలో ప్రచార భేరి పోస్టర్లు విడుదల చేస్తున్న వామపక్షాల నాయకులు

నేరాలు ఘోరాలు

ఆర్టీసీ బస్సు-లారీ ఢీ..తప్పిన పెను ప్రమాదం

గుత్తి : పట్టణంలోని ప్రభుత్వ ఆసుపత్రి వద్ద గురువారం ఆర్టీసీ బస్సు-లారీ పరస్పరం ఢీకొన్నాయి. వాహనాలు తక్కువ వేగంతో వెళ్తుండడంతో పెను ప్రమాదం తప్పింది. ఆదోని నుంచి బెంగళూరుకు వెళ్తున్న ఆర్టీసీ బస్సు.. అనంతపురం వైపు వెళ్తున్న లారీ పరస్పరం ఢీకొనడంతో లారీ అద్దాలు పాక్షికంగా దెబ్బతిన్నాయి. బస్సులో 43 మంది ప్రయాణికులు ఉన్నారు. వాహనాలు ఢీకొనడంతో వారంతా భయాందోళనలకు గురయ్యారు. వెంటనే ఆయా డ్రైవర్లు దిగి వాగ్వాదానికి దిగడంతో వాహనాల రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. వెంటనే సంఘటన స్థలానికి పోలీసులు వాహనాలను వేరేమార్గం ద్వారా తరలించారు. స్థానికులు కల్పించుకుని డ్రైవర్లకు సర్దిచెప్పడంతో వివాదం సద్దుమణిగింది.

ముందుభాగం దెబ్బతిన్న లారీ

దళిత రైతు సంజీవులు కుటుంబాన్ని ఆదుకోవాలి

దళిత రైతు సంజీవులు కుటుంబంతో రైతుసంఘం నాయకులు

అనంతపురం కలెక్టరేట్ : కలగళ్ల గ్రామంలో ఆత్మహత్య చేసుకున్న దళిత రైతు సంజీవులు కుటుంబానికి ప్రభుత్వం రూ.20 లక్షల ఎక్స్‌గ్రేషియా ఇచ్చి కుటుంబాన్ని ఆదుకోవాలని ఎపి వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం.క్రిష్ణమూర్తి డిమాండ్ చేశారు. ఈమేరకు రైతు సంజీవులు కుటుంబాన్ని సిపిఎం, వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు గురువారం పరామర్శించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కూడేరు మండలంలోని కలగళ్ల గ్రామంలో దళిత కుటుంబానికి చెందిన సంజీవులు అతి చిన్న వయసులోనే వ్యవసాయ పనులు చేసుకుంటూ జీవనం గడుపుతూ ఉండేవాడన్నారు. 2012 సంవత్సరంలోనే నాలుగు ఎకరాల పొలంలో సీనా చెట్లు నాటించి అందులో ఐదు ఆరు బోర్లు వేయించి లక్షల రూపాయలు పెట్టుబడి పెట్టాడన్నారు. ఇప్పటి వరకు పెట్టిన పెట్టబడులు తిరిగిరాక సుమారుగా రూ.15 లక్షల వరకు అప్పులు చేశారన్నారు. ఇతనికి ఇద్దరు కూతుర్లు ప్రస్తుతం భార్య గర్భవతిగా ఉందన్నారు. కుటుంబ పోషణ భారమై అప్పులు ఎలా తీర్చాలని మనోవేదనకు గురై రైతు సంజీవులు పెనకచర్ల ఫారెస్ట్‌లో చెట్టుకు ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడన్నారు. నాలుగు రోజుల పాటు చెట్టుకు మృతదేహం వేలాడుతూనే ఉందన్నారు. సమీపంలోని గొర్రెల కాపరులు రైతు స్కూటర్‌ను గుర్తించి అందులోనే ఆధార్ కార్డు ద్వారా సమాచారం తెలుసుకుని గ్రామ సర్పంచ్‌కి ఫోన్ ద్వారా సమాచారం ఇచ్చారన్నారు. ఆత్మహత్య చేసుకుని నెల రోజులు గడుస్తున్నా ప్రభుత్వం ఇప్పటి వరకు స్పందించకుండా నిర్లక్ష్యంగా వ్యవహరించడం సరికాదన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం వెంటనే స్పందించి ఆ కుటుంబానికి రూ.20 లక్షల నష్టపరిహారం చెల్లించాలని, కుటుంబంలోని పెద్ద దిక్కుగా ఉన్న సంజీవులు భార్యకు ఉద్యోగం ఇవ్వాలని డిమాండ్ చేశారు.

సిఎం పర్యటనను విజయవంతం చేయండి

శింగనమల : సిఎం జగన్ మండల పర్యటనను విజయవంతం చేయాలని ప్రభుత్వ సలహాదారు ఆలూరు సాంబశివారెడ్డి పిలుపునిచ్చారు. ఈమేరకు గురువారం మండల కేంద్రంలోని అమ్మవారిశాలలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఈనెల 17న మండల కేంద్రంలో నిర్వహించనున్న బహిరంగ సభలో వసతి దీవెన నగదు బదిలీ పథకానికి బటన్ నొక్కనున్నట్లు తెలిపారు. కావున వైసిపి నాయకులు, కార్యకర్తలు భారీ ఎత్తున తరలివచ్చి విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సింగిల్‌విండో అధ్యక్షుడు బొమ్మన శ్రీరామిరెడ్డి, ఎంపిపి యోగేశ్వరి, వైసిపి మండల కన్వీనర్ పట్నం నగేష్, తరిమెల భాస్కర్‌రెడ్డి, జలాలపురం సర్పంచి తరిమెల రాజమోహన్ రెడ్డి, నాయకులు ఎన్‌వి నారాయణ, నూర్ మొహమ్మద్, మల్లికార్జున్‌రెడ్డి, శ్రీనివాస్‌నాయక్, పరంధామరెడ్డి, వెంకటరమణ, రంగస్వామి, గాండ్ల కార్పొరేషన్ డైరెక్టర్ నరసయ్య, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

పివికెకెలో ప్రాంగణ నియామకాలు

అనంతపురం : స్థానిక రుద్రంపేటలో ఉన్న పివికెకె ఇంజినీరింగ్ కళాశాలలో గురువారం ట్యాప్ అకాడమీ సంస్థ ఆధ్వర్యంలో ప్రాంగణ నియామకాలు నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ బండి రమేష్‌బాబు మాట్లాడుతూ ఈ ప్రాంగణ నియామకాలను పివికెకె ఐటీలో బీటెక్ చివరి సంవత్సరం చదువుతున్న అన్ని విభాగాల విద్యార్థుల కోసం ప్రఖ్యాత సంస్థ ట్యాప్ అకాడమీ ద్వారా నిర్వహించనున్నట్లు తెలిపారు. భవిష్యత్తులో మరిన్ని ప్రముఖ సంస్థల ద్వారా ప్రాంగణ నియామకాలు నిర్వహిస్తామని తెలిపారు. ప్రాంగణ నియామక అధికారి భానుకిరణ్ మాట్లాడుతూ ఇంటర్వ్యూ ప్రక్రియలో భాగంగా నిర్వహించిన ఆప్టిట్యూడ్, కమ్యునికేషన్, టెక్నికల్, హెచ్ఆర్ రౌండ్ అనంతరం 12 మంది విద్యార్థులు ఎంపికైనట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రత్యేకాధికారి శ్రీనివాసులురెడ్డి, యాజమాన్య ప్రతినిధి శ్రీకాంత్‌రెడ్డి, సంస్థ ప్రతినిధులు, విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.

పార్టీలకతీతంగా సంక్షేమ పథకాలు

ఉరవకొండ : వైసిపి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక పార్టీలకు అతీతంగా సంక్షేమ పథకాలు అందిస్తున్నామని మాజీ ఎమ్మెల్యే వై.విశ్వేశ్వరరెడ్డి అన్నారు. గురువారం మండలం పరిధిలోని మోపిడి గ్రామంలో సర్పంచ్ సిద్ధార్థ ఆధ్వర్యంలో 'గడప గడపకు మన ప్రభుత్వం' కార్యక్రమం నిర్వహించారు. ఇందులో భాగంగా ఇంటింటికీ వెళ్లి ప్రజల సమస్యలను అడిగి తెలుసుకోవడంతోపాటు సంక్షేమ పథకాలపై ఆరాతీశారు. అనంతరం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో సిఎం జగన్ చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. ఈ సదర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజా సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయమన్నారు. ఇందులో భాగంగానే ఎన్నికల ముందు ఇచ్చిన ప్రతి హామీని నెరవేర్చినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, అధికారులు, వైసిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఎస్పీని కలిసిన ఎఐబిఎస్ఎస్ నేతలు

ఎస్పీని సన్మానిస్తున్న ఎఐబిఎస్ఎస్ నాయకులు

అనంతపురం కలెక్టరేట్ : నూతనంగా బాధ్యతలు స్వీకరించిన ఎస్పీగా కంచి శ్రీనివాసరావును ఆల్ ఇండియా బంజరా సేవాసంఘ్ నాయకులు గురువారం కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఎఐబిఎస్ఎస్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఎస్.బాలాజీనాయక్, పి.బాబు నాయక్, జిల్లా గౌరవాధ్యక్షులు ఎ.అశ్వర్థనాయక్ తదితరులు ఎస్పీకి శాలువా కప్పి పుష్పగుచ్చాలు అందజేసి అభినందనలు తెలిపారు. జిల్లాలో గిరిజనుల సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేయాలని కోరారు. ఎస్పీని కలిసిన వారిలో ఎఐబిఎస్ఎస్ రాష్ట్ర నాయకులు పి.రంగ్లానాయక్, ధర్మ్‌సింగ్‌నాయక్, శంకర్‌లాల్‌నాయక్, ఉపాధ్యక్షులు డి.హర్జేనాయక్, సంయుక్త కార్యదర్శి ఈశ్వరి బాయి, నరేష్ తదితరులు పాల్గొన్నారు.

సిఎం పర్యటన ఏర్పాట్లు పరిశీలన

ప్రజాశక్తి-నార్పల

ముఖ్యమంత్రి జగన్ ఈనెల 17న నార్పలకు రానున్న నేపథ్యంలో అనంతపురం రేంజ్ డిఐజి అమ్మిరెడ్డి, ఎస్పీ కె.శ్రీనివాసరావు గురువారం ఏర్పాట్లను పరిశీలించారు. ఇందులో భాగంగా నార్పలలోని ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాల వద్ద ఏర్పాటు చేస్తున్న హెలిప్యాడ్, సిఎం పాల్గొనే బహిరంగ సభ, నార్పల క్రాస్ రోడ్డులో పార్కింగు స్థలాలను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పీ ఇ.నాగేంద్రుడు, అనంతపురం డీఎస్పీ జి.ప్రసాదరెడ్డి, శింగనమల సి.ఐ అస్రార్‌బాషా, అధికారులు పాల్గొన్నారు.

టిడ్కో ఇల్లు ఇవ్వకుండా స్టిక్కర్లు వేయడం ఏంటి : టిడిపి

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్

టిడ్కో ఇళ్లను యూపుతున్న టిడిపి నాయకులు

పేదల సొంతింటి కల సాకారం కోసం టిడిపి ప్రభుత్వ హయాంలో నగరంలో నిర్మించిన టిడ్కో ఇళ్లను పేదలకు అప్పగించకుండా వైసిపి స్టిక్కర్లు వేయడం ఏంటని టిడిపి నాయకులు ప్రశ్నించారు. ఈమేరకు నగర సమీపంలోని పండమేరు వద్ద నిర్మించిన టిడ్కో ఇళ్లను టిడిపి నాయకులు గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ మున్సిపల్ కమిషనర్ పేరుపై డీడీలు చెల్లించి సంవత్సరాలు గడుస్తున్నా టిడ్కో ఇళ్లను అందించడంతో జగన్ ప్రభుత్వం పూర్తిగా విఫలమైందన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సిఎం జగన్‌కు ఇళ్లు నిర్మించడం చేతకాక నిర్మించిన ఇళ్లకు స్టిక్కర్లను వేయడం పనిగా పెట్టుకున్నారని విమర్శించారు. ఎన్నికల ముందు తాను అధికారంలోకి రాగానే రూ.1కే ఇంటిని రిజిస్ట్రేషన్ చేసి ఇస్తామని హామీ ఇచ్చిన జగన్ ఇప్పుడు ఏం సమాధానం ఇస్తాడో చెప్పాలని డిమాండ్ చేశారు. తక్షణమే టిడ్కో గృహాలను పేదలకు అందించకుంటే పెద్దఎత్తున ఆందోళన చేస్తామని ప్రజల పక్షాన నిలబడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో టిడిపి బీసీ సెల్ జిల్లా ప్రధాన కార్యదర్శి పోతుల, నాయకులు లక్ష్మీ, నర్సింహులు, నగర అధ్యక్షులు సిమెంటు పోలన్న, బీసీ నాయకులు వడ్డే నాగరాజు, తదితరులు పాల్గొన్నారు.

రైల్వేను ప్రయివేటీకరించొద్దు..

కేంద్ర రైల్వే సహాయ మంత్రికి ఎమ్మెల్సీ వై.శివరామిరెడ్డి వినతి

ప్రజాశక్తి-ఉరవకొండ

రైల్వే శాఖను ప్రయివేటీకరిస్తే ప్రజలపై వారాలు పడతాయని, వెంటనే ఆ ఆలోచన విరమించుకోవాలని ఎమ్మెల్సీ శివరామిరెడ్డి కోరారు. ఈమేరకు గురువారం గుంతకల్లు రైల్వే డివిజన్ పర్యటనకు విచ్చేసిన కేంద్ర రైల్వే సహాయ శాఖ మంత్రి రావు సాహెబ్ పాటిల్ ధన్వేను వై.శివరామిరెడ్డి మర్యాద పూర్వకంగా కలిశారు. ఇందులో భాగంగా గుంతకల్లు డివిజన్‌లోని పలు సమస్యలపై వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బిజెపి ప్రభుత్వం దేశంలో రైల్వేశాఖను ప్రయివేటీకరించడానికి దశలవారీగా ముందుకెళ్తోందన్నారు. అలా చేస్తే పేద, మధ్య తరగతి ప్రజల ప్రయాణ ఖర్చులు మితిమీరుతాయని హెచ్చరించారు. అంతేకాకుండా రైల్వే శాఖలో పని చేసే 12 లక్షల మంది ఉద్యోగుల భవితవ్యం ప్రశ్నార్థకం అవుతుందన్నారు. కావున భారత ప్రభుత్వం ఇలాంటి చర్యలను ఉపసంహరించుకోవాలని కోరారు. ఇకపోతే గుంతకల్లు నుంచి రాయదుర్గానికి ఉన్న రైల్వేలైను దాదాపు 100 కిలోమీటర్ల దూరం కలిగి ఉందన్నారు. కాబట్టి గుంతకల్లు నుంచి కళ్యాణదుర్గానికి కొత్తగా రైల్వే లైన్ వయా ఉరవకొండ బెలుగుప్ప మీదుగా ఏర్పాటు చేసినట్లయితే దాదాపు 20 కిలోమీటర్ల దూరం తగ్గుతుందన్నారు. కొత్త రైల్వేలైన్ నిర్మాణానికి సాధ్యసాధ్యాలను పరిశీలించి వెంటనే మంజూరు చేయాలని కోరారు.

కేంద్ర రైల్వే సహాయ మంత్రికి వినతిపత్రం సమర్పిస్తున్న ఎమ్మెల్సీ వై.శివరామిరెడ్డి

రైతు సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

మాజీ ఎమ్మెల్యే వై.విశ్వేశ్వరరెడ్డి

ప్రజాశక్తి-ఉరవకొండ

రైతు సంక్షేమమే ధ్యేయంగా సిఎం జగన్ పాలన సాగిస్తున్నారని మాజీ ఎమ్మెల్యే వై.విశ్వేశ్వరరెడ్డి అన్నారు. గురువారం మండలంలోని మోపిడి గ్రామంలో 'వైఎస్ఆర్ జలకళ' పథకం కింద మంజూరైన బోరుబావి మోటార్లను సర్పంచి సిద్ధార్థ ఆధ్వర్యంలో పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భూముల్లో బోరుబావులను ఏర్పాటు చేసుకుని పంటలు సాగు చేసుకోవాలన్న రైతుల కలను వైఎస్ఆర్ జలకళతో సిఎం జగన్ సాకారం చేస్తున్నారన్నారు. ఇందులో భాగంగా బోరుబావి తవ్వకం మొదలు, విద్యుత్ కనెక్షన్, మోటారు పంపులను ఉచితంగా అందివ్వనున్నట్లు తెలిపారు. అలాగే సబ్సిడీతో డ్రిప్ సౌకర్యం కల్పిస్తున్నట్లు వివరించారు. అనంతరం ప్రజాప్రతినిధులు, నాయకులతో కలిసి కొనాపురం, లత్తవరం, ఆమిద్యాల గ్రామాలకు చెందిన రైతులు బొజ్జప్ప, ఓబన్న, పర్వతప్పకు మోటార్లు, పైపులు, స్టార్టర్ పెట్టెలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో వైఎస్ఆర్ జలకళ టిఎ ఇషాక్, వైసిపి నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

బోరుబావి మోటార్లను అందజేస్తున్న మాజీ ఎమ్మెల్యే వై.విశ్వేశ్వరరెడ్డి

మట్టి నమూనా సేకరణపై శిక్షణ

ప్రజాశక్తి-రాయదుర్గం రూరల్

మండల పరిధిలోని రాతిబావివంక రైతు భరోసా కేంద్రంలో మండల వ్యవసాయ అధికారి మహేంద్ర ఆధ్వర్యంలో 15 రైతు భరోసా కేంద్రాల సిబ్బందికి గురువారం భూసార పరీక్ష, మట్టి నమూనా సేకరణపై శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా మహేంద్ర మాట్లాడుతూ రైతులకు భూసార పరీక్షల ఆధారంగా రసాయనిక ఎరువుల వాడకం, నేల ఆరోగ్యాన్ని కాపాడుతూ రైతులకు తక్కువ పెట్టుబడితో అధిక దిగుబడి సాధించడానికి మట్టి నమూనా పరీక్షలు ఉపకరిస్తాయన్నారు. ప్రతి రైతు పొలంలో 500 గ్రాముల మట్టి నమూనా సేకరించి భూసార పరీక్ష కేంద్రానికి పరీక్ష నిమిత్తం పంపాలని వ్యవసాయ సిబ్బందిని ఆదేశించారు. రాబోవు ఖరీఫ్ సీజన్లో రైతులు వేసే పంటలకు ఖచ్చితమైన తగిన ఎరువుల మోతాదును సిఫారసు చేసి, నేలను సారవంతం చేస్తూ, తక్కువ పెట్టుబడి తో అధిక దిగుబడులు సాధించేలా పని చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో రైతు భరోసా కేంద్రం సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

బ్రహ్మసముద్రం : భూసార పరీక్ష ఫలితాల ఆధారంగా ఎరువులు వేసుకుంటే పెట్టుబడి ఖర్చులు తగ్గించవచ్చని మండల వ్యవసాయ అధికారి సరిత సూచించారు. గురువారం మండలంలోని బొమ్మగానిపల్లి గ్రామ ఆర్‌బికె పరిధిలో ఉన్న సిబ్బందికి మట్టి నమూనాల సేకరణ, పరీక్షలు నేల, ఆరోగ్య కార్డులపై శిక్షణ ఇచ్చారు. ఇందులో భాగంగా పొలాల్లో మట్టిని సేకరించే విధానం, దాని ప్రయోగశాలకు ఎలా పంపించాలనే అంశాలపై ప్రయోగాత్మకంగా వివరించారు. ఈ కార్యక్రమంలో రైతు భరోసా కేంద్ర సిబ్బంది, సర్పంచి ఆదినారాయణరెడ్డి, వైస్ ఎంపిపి వెంకటేష్‌నాయక్, ఎంపిఇఒలు, రైతులు పాల్గొన్నారు.

బ్రహ్మసముద్రంలో మట్టి నమూనాలు తీసే విధానంపై శిక్షణ ఇస్తున్న అధికారులు

మామిడి కోత దశలో సరైన పద్ధతులు పాటించాలి

ఉద్యానవన శాఖ అధికారిణి మిత్రవింద మాధవి

గుత్తి : మామిడి కోత దశలో రైతులు సరైన పద్ధతులు పాటించాలని గుత్తి డివిజన్ ఉద్యానవన శాఖ అధికారిణి మిత్రవింద మాధవి సూచించారు. గురువారం స్థానిక కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడుతూ మామిడి పంటలు సాగు చేసిన రైతులు కోత సమయంలో రవాణా, ప్యాకింగ్, ఎగుమతులలో తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. మామిడి సరైన పక్వ దశలో కోయాలన్నారు. మామిడి పండ్లను పంపే మార్కెట్ దూరం రవాణా సదుపాయాన్ని బట్టి కాయల పరిపక్వతను నిర్ణయించుకొని కోయాలన్నారు. రైతులు సరైన పద్ధతులు పాటించి కాయలను కోసి విక్రయిస్తే అధిక ఆదాయం వస్తుందన్నారు.

మాట్లాడుతున్న హెచ్ఓ మిత్రవింద మాధవి

ఇంటింటికీ స్టిక్కర్లు సిగ్గుచేటు : టిడిపి

అనంతపురం : వైసిపి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ప్రతి ఇంట్లో కన్నీళ్లు ఇప్పుడు స్టిక్కర్లు అతికించడం సిగ్గుచేటని టిడిపి జిల్లా నాయకులు పి.తూముచెర్ల బాబా ఫక్రుద్దీన్‌వలి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. వైసిపి అధికారంలోకి వచ్చినప్పటి నుంచి నిత్యావసర సరుకుల ధరలు, విద్యుత్ ఛార్జీలు పెంచుతూ ఇంటింటికీ కన్నీళ్లు పెట్టించారన్నారు. ఉచితంగా పక్కా ఇళ్లు కట్టిస్తామని చెప్పి మోసం చేశాడన్నారు. ఆఖరికి ఎంతోమంది పేదలు దురదృష్టవశాత్తు మరణిస్తే కనీసం ఆర్థికసాయం కూడా చేయడం లేదన్నారు. కేవలం ఎన్నికలు దగ్గర పడుతుండటంతోనే ఇంటింటికీ స్టిక్కర్లు అతికిస్తున్నారన్నారు. ఎన్ని స్టిక్కర్లు అతికించినా వచ్చే ఎన్నికల్లో వైసిపికి ఓటమి తప్పదన్నారు.

ముగిసిన 98 డీఎస్సీ అభ్యర్థుల ఎంపిక

అనంతపురం సిటీ : జిల్లా విద్యాశాఖ ఆధ్వర్యంలో నగరంలోని జిల్లా సైన్ సెంటర్‌లో రెండు రోజులగా నిర్వహిస్తున్న 1998 డీఎస్సీకి ఎంపికైన అభ్యర్థుల కౌన్సిలింగ్ ప్రక్రియ గురువారం సాయంత్రం ముగిసింది. 536 మందికి 487 మంది హాజరయ్యారు. హాజరైన అభ్యర్థులందరికీ డిఇఒ ఎం.సాయిరాం నియామక ఉత్తర్వులను అందజేశారు. వీరందరూ కాంట్రాక్టు పద్ధతిలో మినిమం టైంస్కేల్ కింద సెకండ్ గ్రేడ్ టీచర్లుగా పనిచేయనున్నట్లు డిఇఒ తెలిపారు. ఈ కార్యక్రమంలో సత్యసాయి జిల్లా ఇన్‌ఛార్జి డిఇఒ మీనాక్షి, ఏడీలు కష్ణయ్య, ఉదయ్, డిప్యూటీ డీఈవోలు రంగస్వామి, పద్మప్రియ, శంకర ప్రసాద్, జిల్లా విద్యాశాఖ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

యువగళం పాదయాత్రకు జిల్లా నేతల వీడ్కోలు

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్

టిడిపి జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ చేపట్టిన యువగళం పాదయాత్ర జిల్లాలో ముగించుకుని గురువారం కర్నూలు జిల్లాలోకి ప్రవేశించడంతో జిల్లా నాయకులు వీడ్కోలు పలికారు. ఇందులో భాగంగా కర్నూలు జిల్లా టిడిపి ఇన్‌చార్జి వైకుంఠం ప్రభాకర్‌చౌదరి నారా లోకేష్‌కు స్వాగతం పలికారు. అనంతరం ఆ జిల్లా నేతలతో కలిసి యువనేత పాదయాత్రలో నడిచారు.

యాడికి : టిడిపి యువనేత నారా లోకేష్ జిల్లా పర్యటన కర్నూలు జిల్లాలోకి ప్రవేశించగా జిల్లా సరిహద్దు గ్రామం యాడికి మండలం దైవాలమడుగు వద్ద జిల్లా నేతలు వీడ్కోలు పలికారు. ఇందులో భాగంగా తాడిపత్రి టిడిపి ఇన్‌ఛార్జి జెసి అస్మిత్‌రెడ్డి, తాడిపత్రి మున్సిపల్ ఛైర్మన్ జెసి ప్రభాకర్‌రెడ్డి, తదితరులు నారాలోకేష్‌ను మెమొంటోతో సత్కరించారు. అనంతరం కర్నూలు జిల్లా నల్లమేకలపల్లిలోకి నారా లోకేష్ తరలివెళ్లారు.

జిల్లా సరిహద్దు పాదయాత్రలో పాల్గొన్న ప్రభాకర్‌చౌదరి

శింగనమల : యువగళం పాదయాత్ర జిల్లా ముగింపు సందర్భంగా నారా లోకేష్‌కు తెలుగు యువత రాష్ట్ర అధికార ప్రతినిధి దండు శ్రీనివాసులుకు జ్ఞాపిక అందజేసి వీడ్కోలు పలికారు. ఈ కార్యక్రమంలో దాసరి గంగాధర్, మాజీ ఎంపిటిసి కుళ్లాయప్ప, బిసి సెల్ రాష్ట్ర కార్యదర్శి ఎం.ఆదినారాయణ, బిసి సెల్ పార్లమెంట్ అధికార ప్రతినిధి బండి పరుశరాం, బిసి సెల్ నియోజకవర్గ అధ్యక్షులు బెస్త నారాయణస్వామి పాల్గొన్నారు.

ప్రభుత్వ ఆసుపత్రికి బెంచీలు వితరణ

గుత్తి : పట్టణంలోని ప్రభుత్వాసుపత్రికి నాలుగు బెంచీలను వితరణ చేసినట్లు పట్టణానికి చెందిన జీకే బ్రాడ్ బ్యాండ్ ఇంటర్ నెట్ యజమాని కృష్ణయ్య తెలిపారు. తన తండ్రి దివంగత వెంకటేష్ జ్ఞాపకార్థం ఆసుపత్రికి వచ్చే రోగుల సౌకర్యార్థం గురువారం బెంచీలను ఆసుపత్రిలో ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ వైద్యాధికారి డాక్టర్ సి.యల్లప్ప, హోటల్ న్యూ అన్నపూర్ణ యజమానులు ఎన్.శివప్రసాద్, ఎన్.రవికుమార్, హెడ్ నర్స్ నాగమణి, స్టాఫ్‌నర్స్ వరలక్ష్మి, సిబ్బంది రాజేష్, రమణ పాల్గొన్నారు.

16న థ్రెడ్ ట్రస్టు సిల్వర్ జూబ్లీ వేడుకలు

అనంతపురం : తపోవనంలోని ప్రత్యేక పిల్లల పాఠశాల థ్రెడ్ ట్రస్టు సిల్వర్ జూబ్లీ వేడుకలను పాఠశాల ప్రాంగణంలో ఈనెల 16న ఘనంగా నిర్వహించనున్నట్లు సంస్థ ట్రస్టీ గురుమూర్తి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. రూరల్ ఎడ్యుకేషన్ డెవలప్‌మెంట్ ట్రస్టు (థ్రెడ్) 1998లో కరణం వెంకటేశ్వర్లు స్థాపించినట్లు తెలిపారు. అప్పటి నుంచి సమాజంలోని ప్రత్యేక పిల్లలను బాధ్యతను పెంచుతున్నట్లు తెలిపారు. సిల్వర్ జూబ్లీ కార్యక్రమానికి జిల్లా పరిషత్ ఛైర్‌పర్సన్ బోయ గిరిజమ్మ, ఆర్డీవో మధుసూదన్, డీఎస్పీ శ్రీనివాసులు హాజరుకానున్నట్లు తెలిపారు.

CHANGE OF NAME

I, KALYANDURG RAHMAT BEGUM (Old Name) W/o KALYANDURG GHOUSE PEERAN residing at 6/2/672, Ram Nagar, Anantapuram - 515001, Anantapur Dist. AP. Changing my name from **KALYANDURG RAHMAT BEGUM** to **KALYANDURG RAHAMAT BEE (New Name).** Hence fort, I am being called as KALYANDURG RAHAMAT BEE for all purposes.

ఏలంజి సర్పంచి మృతి

బొమ్మనహాల్ : మండలంలోని ఏలంజి పంచాయతీ సర్పంచి తిమ్మక్క (52) అనారోగ్యంతో బళ్లారిలోని ప్రయివేట్ ఆసుపత్రిలో చికిత్స పొందు మృతి చెందినట్లు భర్త తిమ్మప్ప తెలిపారు. ఈమె రెండోసారి సర్పంచిగా ఎన్నికైనట్లు గ్రామస్తులు తెలిపారు. గత కొన్ని రోజుల నుంచి అనారోగ్యంతో బాధపడుతున్న ఆమె పలు ఆసుపత్రుల్లో చికిత్స తీసుకుంది. ఇందులో భాగంగానే బళ్లారిలోని ఓ ప్రయివేటు ఆసుపత్రిలో చికిత్స పొందుతూ పరిస్థితి విషమించి గురువారం సాయంత్రం మృతి చెందినట్లు తెలిపారు. ఆమె మృతి పట్ల పలువురు సర్పంచులు, ఎంపిటిసిలు సంతాపం వ్యక్తం చేశారు.

రంజాన్ తోఫా పంపిణీ అభినందనీయం : మేయర్

ప్రజాశక్తి-అనంతపురం కార్పొరేషన్

పేదలు సంతోషంగా పండుగ జరుపుకోవాలన్న ఉద్దేశంతో రంజాన్ తోఫా పంపిణీ చేయడం అభినందనీయమని మేయర్ మొహమ్మద్ వసీం అన్నారు. గురువారం నగరంలోని 11వ డివిజన్‌లో షేక్ నిజాం, సామాజిక కార్యకర్త జాకీర్ హుస్సేన్ ఆధ్వర్యంలో రంజాన్ తోఫా పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ రంజాన్ మాసంలో తనకు ఉన్నదానిలో పేద ముస్లింలకు సాయం అందించాలన్న సంకల్పంతో రంజాన్ తోఫా అందించడం గొప్ప కార్యక్రమమన్నారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్లు బాబా ఫక్రుద్దీన్, సామాజిక సేవకుడు జాకీర్ హుస్సేన్, మైనార్టీ మతపెద్దలు ఖాజీ, జాకీర్ హుస్సేన్, నిజాం, మసూద్, జాఫర్ తదితరులు పాల్గొన్నారు.

రంజాన్ తోఫా పంపిణీ చేస్తున్న మేయర్ వసీం